www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 181 | హైదరాబాద్ | శుక్రవారం | 24-10-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## మీ అవినీతికి తల వంచకపోతే అధికారులను బలి చేస్తారా?

జనంతోడు, హైదరాబాద్ :



మీ అవినీతికి తల వంచకపోతే అధికారులను బలి చేస్తారా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనా వ్యవస్థ, అవినీతి రాజకీయాలకు ఐఏఎస్ అధికారి రిజ్వీ వీఆర్ఎస్ నిదర్శనమని ఎక్స్‌లో పోస్టు చేశారు. నిజాయితీగల, సమర్థుడైన అధికారి వీఆర్ఎస్ తీసుకునే పరిస్థితికి ఎందుకొచ్చిందన్నారు. దీనిపై తెలంగాణ ప్రజలకు తెలుసుకునే హక్కు ఉందన్నారు. మీ వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికారులను వేధిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లలో మంత్రులు జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించారు. అవినీతి బయటపడితే రాజీ పడని అధికారులపైనే నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. గతంలో భారత రాష్ట్రసమితి ప్రభుత్వం కూడా ఇదే విధంగా వ్యవహరించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కేసీఆర్ అధికారులను బలి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్ములా ఈరేసు కేసులో తన తప్పులను దాచుకునేందుకు కేటీఆర్ అధికారులపై నిందలు మోపారని ధ్వజమెత్తారు.

# ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

**ఇద్దరి కన్నా ఎక్కువ పిల్లలున్నా స్థానిక ఎన్నికల్లో పోటీకి అర్హులే!**

**పంచాయతీరాజ్ చట్టంలో కీలక సవరణ దిశగా రేవంత్ సర్కారు**

**ఆర్డినెన్స్ ద్వారా చట్ట సవరణకు ఆమోదం**

**త్వరలో అమలులోకి రానున్న కొత్త విధానం**

హైదరాబాద్, సిద్దిపేట పవర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. ఇద్దరి కన్నా ఎక్కువ పిల్లలు ఉన్నవారు ఎన్నికల్లో పోటీకి అనర్హులు అనే నిబంధనను రద్దు చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఈ మేరకు ఆమోదముద్ర వేశారు.

ప్రస్తుతం అమల్లో ఉన్న ఈ నిబంధన వల్ల ఇద్దరి కన్నా ఎక్కువ సంతానం ఉన్న అనేక మంది ఆశావహులు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కోల్పోతున్నారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, ఈ నిబంధనను తొలగించాలని తీర్మానించింది. ఈ నిర్ణయాన్ని వేగంగా అమలులోకి తెచ్చేందుకు ప్రభుత్వం మిగతా 2లో..






కాంగ్రెస్‌కు

## 50వేల మెజార్టీ

**జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నికలో గెలుపు మాదే**

**నిజామాబాద్‌ను మేటి జిల్లాగా తీర్చిదిద్దుతాం**

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటన**

02

## రక్షణ రంగానికి ఊతం

**రూ.79 వేల కోట్ల ప్రతిపాదనలు**

**రక్షణ కొనుగోళ్ల మండలి భేటీలో ఆమోదం**

**మరింత మెరుగుపడనున్న యుద్ధ సామర్థ్యం**

**శత్రు దేశాలకు ఇక చుక్కలే**



02



# ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ఆర్థిక పరిస్థితిపై ఇంటింటికి తిరిగి వివరించండి**

**జూబ్లీహిల్స్‌లో సునీత గెలుపు ఖాయం**

**మెజార్టీ కోసం గట్టి ప్రయత్నం చేయండి**

**హైడ్రాను పంపుతున్న ప్రభుత్వ పెద్దలను గల్లా పట్టి నిలదీయండి**

**కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీఆర్ఎస్సే**

**జూబ్లీహిల్స్‌లో బీజేపీకి అంత సీన్ లేదు**

**పార్టీ నేతలతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవెల్లిలో 3 గంటల పాటు సుదీర్ఘ సమావేశం**

హైదరాబాద్, సిద్దిపేట పవర్

కాంగ్రెస్ ప్రభుత్వ దోపిడీ పాలనతో ఇప్పటికే రాష్ట్రం గుల్ల అయ్యిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. జూబ్లీహిల్స్‌లో తన అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ రౌడీ షీటర్‌ను నిలబెట్టి హైదరాబాద్ ప్రజల విజ్ఞతకు కఠిన పరీక్ష పెట్టిందని, ప్రజలు చిత్తుగా ఓడించి నియోజకవర్గ గౌరవాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో పార్టీ తరఫున పోటీ చేస్తున్న మాగంటి సునీత గెలుపే లక్ష్యంగా గురువారం ఎర్రవెల్లి నివాసంలో కేటీఆర్, హరీశ్ రావుతో పాటు పార్టీ క్యాంపెయినర్లు, సీనియర్ నేతలు, డివిజన్ ఇన్‌ఛార్జ్‌లు, మిగతా 2లో..

## గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ

**ఇదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం**

**ఇప్పటికే ఈ రంగంలో పురోగతి సాధించాం**

**18 నెలల్లో రూ.3.2 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాం**

**త్వరలో కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీ తీసుకొస్తాం**

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి**



హైదరాబాద్, సిద్దిపేట పవర్

తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా రూపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, ఇండస్ట్రీస్ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో 'ఆస్ బయోటెక్' అనే అత్యున్నత లైఫ్ సైన్సెస్ నిర్ణాయక సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు కీలకోపన్యాసం చేశారు. ఈ సదస్సులో తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగంలో సాధించిన పురోగతి, భవిష్యత్ ప్రణాళికలు, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం మిగతా 2లో..




## జూబ్లీహిల్స్ బరిలో 81 మంది ?

**211 అభ్యర్థులు 321 నామినేషన్‌లు**

**130 అభ్యర్థులకు చెందిన 186 తిరస్కరణ**

**పోటీలో ఎంతమంది అనేదానిపై ఎట్టకేలకు క్లారిటీ**

**నేటితో ముగియనున్న ఉపసంహరణ గడువు**

05

## ప్రజలు కోరుకుంటే రాజకీయ పార్టీగా మారొచ్చు

**పజల సమస్యలపై గళమెత్తుతూనే ఉంటాం**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**



హైదరాబాద్, సిద్దిపేట పవర్

రాష్ట్రంలో 19 ఏళ్ల క్రితం ఎన్జీవోగా పుట్టిన తెలంగాణ జాగృతి సంస్థ ప్రజలు కోరుకుంటే రాజకీయ పార్టీగా మారొచ్చని ఆ సంస్థ అధ్యక్షురాలు మిగతా 5లో..



## మహాకూటమి పోస్టర్ల నుంచి రాహుల్ గాంధీ మాయం!

**మహాకూటమి ప్రెస్ మీట్ పోస్టర్లలో మాయమైన రాహుల్ గాంధీ ఫొటో**

**సీఎం అభ్యర్థిగా తేజస్వి యాదవ్‌ను ప్రకటించేందుకు రంగం సిద్ధం**

**కాంగ్రెస్ పార్టీకి గౌరవం లేదంటూ బీజేపీ నేతల ఎద్దేవా**

**యాదవ, ముస్లిం ఓట్లను ఏకం చేసే వ్యూహంతోనే ఈ నిర్ణయం**

**ఇప్పటికీ కొలిక్కిరాని సీట్ల పంపకాలపై కూటమిలో చర్చలు**

బీహార్, సిద్దిపేట పవర్

బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రతిపక్ష మహాకూటమిలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. కూటమి ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ పోస్టర్ల నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫొటో మాయమవడం రాజకీయంగా కలకలం రేపుతోంది. పాట్నాలోని మౌర్య హోటల్‌లో నేడు జరగనున్న ఈ మీడియా సమావేశం పోస్టర్‌లో ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఫొటోను మిగతా 5లో..

## నేడు పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ

**విచారణ చేపట్టనున్న అసెంబ్లీ స్పీకర్**

**నాలుగు కేసులపై మౌఖిక వాదనలు**

**ప్రతి కేసులో ఇరువర్గాల వాదనలు**

**31 వరకు అసెంబ్లీ పరిసరాల్లో ఆంక్షలు**

02

## సీఎం, మంత్రుల పంపకాల పరంపర.. రాష్ట్ర పరువుకు మచ్చ

**కేటీఆర్ ప్రెస్ మీట్‌లో రాష్ట్రంలోని అవినీతి, పంపకాలపై విమర్శ**

**రిజ్వీ రిటైర్మెంట్, టెండర్ వివాదంపై ఘాటైన వ్యాఖ్యలు**

**పారిశ్రామిక వేత్తల బెదిరింపు, సెటిల్‌మెంట్ల పై ఆసక్తికర వ్యాఖ్యలు**

**కాంగ్రెస్‌బీజేపీ జాయింట్ వెంచర్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు**

హైదరాబాద్, సిద్దిపేట పవర్

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం మీడియా సమావేశం నిర్వహించి, రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొద్ది కాలంగా రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న ఘటనలు తెలుగు ప్రజలకు తలవంచుకునే మిగతా 2లో..



www.siddipetpower.com

WWW.SIDDIPETPOWER.COM

### సీఎం, మంత్రుల పంపకాల పరంపర..

# రాష్ట్ర పరువుకు మచ్చ

**మొదటిపేజీ తరువాయి**



పరిస్థితి తెచ్చాయని ఆయన విమర్శించారు. కేటీఆర్ మాట్లాడుతూ, "ఇటీవల జరుగుతున్న పరిణామాలు ఆందోళనకరంగా మారాయి. ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య జరుగుతున్న పంపకాలు రాష్ట్ర పరువుకు మచ్చలాంటివి. ఐఏఎస్ అధికారులను బలి పశువులుగా మార్చే పరిస్థితి వచ్చింది," అని అన్నారు. నిజాయితీ పరుడిగా పేరున్న రిజ్వీ వలంటరీ రిటైర్మెంట్ తీసుకోవాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.
సీఎం అల్లుడు, మంత్రి కుమారుడి మధ్య టెండర్ వివాదం కారణంగా ఒక అధికారి పదవి వదిలేయాల్సిన పరిస్థితి రావడం రాష్ట్ర పరిపాలన దిగజారిపోతున్నదనే సంకేతమని కేటీఆర్ విమర్శించారు. "ఈ ప్రభుత్వం నడుపుతోంది ముమ్మాటికీ దండుపాళ్యం ముఠా లాగే," అని ఘాటుగా వ్యాఖ్యానించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి అధికారులు జైలుకు వెళ్లారని గుర్తుచేస్తూ, "ఇప్పుడు కూడా అదే పరిస్థితి వస్తే జైలుకు వెళ్లాల్సిందే. ఈ ప్రభుత్వం వ్యవస్థలను పూర్తిగా దెబ్బతీసింది. ముఖ్యమంత్రి ఇల్లు పరిపాలనా కేంద్రమా లేక సెటిల్‌మెంట్‌ల అడ్డానా?" అని ప్రశ్నించారు.
తాజాగా వెలుగులోకి వచ్చిన తుపాకీ వివాదంపై కూడా కేటీఆర్ స్పందించారు. "మంత్రి కుమార్తె చెప్పింది.. సీఎం రేవంత్ రెడ్డి తుపాకీ ఇచ్చారని. మరోవైపు కొండా మురళి తుపాకీ ఇచ్చారని అంటున్నారు. ఏది అయినా సరే పారిశ్రామికవేత్తను బెదిరించడం నిజమే. పోలీసులు నిజాయితీ వంతులు అయితే దోషులను అరెస్ట్ చేయాలి," అని కేటీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ పరిధిలో రౌడీ మూకల ర్యాలీలు, పోలీసుల వైఖరి, ప్రభుత్వ నిర్లక్ష్యం రాష్ట్ర ప్రజాస్వామ్యానికి ప్రమాదమని ఆయన వ్యాఖ్యానించారు.
"నా జీవితంలో మంత్రి ఇంటికి పోలీసులు వెళ్లడం చూడలేదు. కానీ ఈ రోజుల్లో అది కూడా జరుగుతోంది. ఇది పాలనా పతనానికి సంకేతం," అని అన్నారు. అంతేకాకుండా.. "ఇలాంటి సెటిల్‌మెంట్‌ల ముఖ్యమంత్రిని నేను ఇప్పటి వరకు చూడలేదు. రాష్ట్రంలో నడుస్తున్నది కాంగ్రెస్-బీజేపీ జాయింట్ వెంచర్ ప్రభుత్వం. బీజేపీ నేతలు, ముఖ్యంగా బండి సంజయ్ ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నారు?" అని ప్రశ్నించారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**మొదటిపేజీ తరువాయి**

క్లస్టర్ల ఇన్‌ఛార్జ్‌లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. 3 గంటల పాటు సుదీర్ఘంగా సమావేశం కొనసాగింది. క్షేత్రస్థాయిలో ఇప్పటి వరకు కొనసాగుతున్న ప్రచారం, సంబంధిత అంశాలపై అధినేతకు ఇన్‌ఛార్జ్‌లు రిపోర్ట్ ఇచ్చారు. సునీత భారీ మెజారిటీతో గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలు, ఎత్తుగడలు, కార్యాచరణకు సంబంధించిన అంశాలపై సమీక్షించి నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సునీత గెలుపును జూబ్లీహిల్స్ ప్రజలు ఇప్పటికే ఖాయం చేశారని, పార్టీ నేతలు ప్రజల వద్దకు వెళ్లి వారితో మమేకమై కాంగ్రెస్ దుష్ట పాలనపై మరింత అవగాహన కల్పించాలన్నారు. భారీ మెజారిటీ కోసం గట్టి ప్రయత్నం చేయాల్సి ఉన్నదని నేతలకు సూచించారు.

**పదేళ్ల అభివృద్ధిని వివరించండి**

బీఆర్ఎస్ పదేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, మానవీయ కోణంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎందుకు మాయమయ్యాయనే విషయాన్ని ప్రజలతో కలిసి చర్చించాలని కేసీఆర్ సూచించారు. గర్భిణులకు మానవీయ కోణంలో అందిస్తున్న కేసీఆర్ కిట్ పథకాన్ని ఎందుకు ఆపేశారో ప్రజలు కాంగ్రెస్ పార్టీని నిలదీయాలని పిలుపునిచ్చారు. యాదవులకు అందిస్తున్న గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ఎందుకు రద్దు చేశారో, చేపల పంపిణీని ఎందుకు దిగమింగారో, మిషన్ భగీరథ నీళ్ళు ఎందుకు రావడం లేదో, బస్తీ దవాఖానలకు సుస్తి ఎందుకు చేసిందో ఓటు అడగడానికి తమ ఇంటి ముందుకు వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థిని ఆ పార్టీ నేతలను నిలదీయాలని కోరారు. హైడ్రా పేరుతో బుల్డోజర్లను తమ గుడిసెల మీదకు తోలి కూలగొడుతున్న కాంగ్రెస్ నాయకులను, తమకు నిలువ నీడ లేకుండా చేస్తున్న ప్రభుత్వ పెద్దలను ఓటు కోసం వచ్చినప్పుడు గల్లా పట్టి నిలదీయాలని సూచించారు. రెసిడెన్షియల్ స్కూళ్లను స్థాపించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించి వారిని ఐఏఎస్, ఐపీఎస్‌ల వంటి అత్యున్నత స్థాయి ఉద్యోగాలను సాధించేలా తీర్చిదిద్దామన్నారు. అలాంటి అత్యున్నత స్థాయి విద్యను హాస్టల్ సౌకర్యాలను అందించిన గురుకులాల్లో పిల్లలు మరణించడం దారుణమని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేసిన రాష్ట్రం దేశంలో తెలంగాణ మాత్రమేనని తెలిపారు. కరోనాతో పాటు పెద్దనోట్ల రద్దుతో సంభవించిన ఆర్థిక సంక్షోభాన్ని కూడా తట్టుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన సంగతిని ప్రజలు మరిచిపోలేదన్నారు. కష్టకాలంలో నిలబెట్టిన తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టం వచ్చినట్టు ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నదని అన్నారు.

**భారీ మెజార్టీ అప్పుడే సాధ్యం**

డివిజన్ల వారీగా, క్లస్టర్ల వారీగా పార్టీ నేతలంతా వ్యూహంతో పని చేయాలని, ప్రజల కష్టాలను అర్థం చేసుకుంటూ వారి




హృదయాలను గెలవాలని అప్పుడే భారీ మెజార్టీ సాధ్యమని కేసీఆర్ వివరించారు. మళ్లీ రాష్ట్రాన్ని బాగు చేయాలంటే ఒక్క బీఆర్ఎస్ పార్టీతో తప్ప ఎవరితో సాధ్యం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఖతం పట్టించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని డివిజన్లలో, క్లస్టర్లలో ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని, చివరి నిమిషం వరకు ప్రతి ఓటు పోల్ అయ్యేలా ప్రయత్నం చేయాలని నేతలకు సూచించారు. ప్రజలకు అర్థమయ్యే తీరుగా వారి భాషలో మాట్లాడుతూ, వారి సమస్యలు తెలుసుకుంటూ సాగాలన్నారు. రౌడీ షీటర్‌గా పేరున్న కాంగ్రెస్ అభ్యర్థి పొరపాటున గెలిస్తే గనక జూబ్లీహిల్స్‌లో శాంతి భద్రతల పరిస్థితి ఎలా ఉంటుందో అక్కడి ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. కత్తులు కటార్లతో ఇప్పుడే వీరంగం వేస్తున్న అభ్యర్థి తాలూకు మనుషులు రేపు గెలిస్తే ఎలా ఉంటుందనే విషయం ఆలోచన చేయాలన్నారు. నిత్యం నాణ్యమైన కరెంటు ఉన్న హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే జనరేటర్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేసుకునే గతి వచ్చిందని, పోయిన వాటర్ ట్యాంకర్లు తిరిగి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**బీజేపీ ఎక్కడ ఉంది?**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రియల్ ఎస్టేట్‌లో తెలంగాణ రాష్ట్రం ముంబై, ఢిల్లీలతో పోటీ పడే పరిస్థితి ఉండేదన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూలగొడుతూ రియల్ ఎస్టేట్ రంగాన్ని మొత్తానికే కుప్ప కూల్చారని మండిపడ్డారు. ఆ రంగంలో పని చేసే లక్షలాది మంది జీవితాలను ఆగం చేశారని, ఇదే విషయం మీద కోపంతో ఉన్న ప్రజలకు అండగా నిలుస్తామని భరోసాను కల్పించాలన్నారు. ఇక, బీజేపీ పార్టీ గురించి అడిగితే అదెక్కడుంది అని ప్రజలే ఉల్టా అడుగుతున్నారని, జూబ్లీహిల్స్ ప్రజలకు బీజేపీ గురించిన ఆలోచనే లేదని స్పష్టం చేశారు. అందుకే ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని కేసీఆర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

# గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**




గురించి వివరంగా వివరించారు.

**ఆర్థిక వృద్ధి, లైఫ్ సైన్సెస్ రంగంలో పురోగతి**

మంత్రి శ్రీధర్‌బాబు తన ప్రసంగంలో తెలంగాణ ఆర్థిక వృద్ధి గురించి మాట్లాడుతూ, రాష్ట్ర జీఎస్‌డీపీ (గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్) జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉందని తెలిపారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉందని, గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం గణనీయమైన ఆర్థిక పురోగతిని సాధించిందని వెల్లడించారు. గత 18 నెలల్లో రూ.3.2 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను రాష్ట్రం ఆకర్షించిందని, ఇది తెలంగాణ ఆర్థిక బలానికి నిదర్శనమని ఆయన అన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ లక్ష్యాల గురించి మాట్లాడుతూ, రాబోయే ఐదేళ్లలో ఈ రంగాన్ని 250 మిలియన్ డాలర్ల విలువకు చేర్చే లక్ష్యంతో పనిచేస్తున్నామని శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి త్వరలో నూతన లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రవేశపెట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ పాలసీ పెట్టుబడిదారులకు మరింత అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తుందని, రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్‌లో ఒక గొప్ప స్థానం**

గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్‌లో భారతదేశం నుంచి హైదరాబాద్‌కు మాత్రమే స్థానం దక్కినట్లు మంత్రి శ్రీధర్‌బాబు గర్వంగా తెలిపారు. హైదరాబాద్ లైఫ్ సైన్సెస్ రంగంలో అగ్రగామిగా నిలిచిందని, ఇక్కడ అందుబాటులో ఉన్న అత్యుత్తమ సౌకర్యాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, పరిశోధన సంస్థలు ఈ విజయానికి కారణమని ఆయన వివరించారు. బయో డిజిటల్ యుగంలో అవసరమైన అధునాతన సాంకేతికతలు, నైపుణ్యాలను అందించేందుకు రాష్ట్ర యువతను సన్నద్ధం చేస్తున్నామని ఆయన చెప్పారు.

**లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ బలాలు**

తెలంగాణలో లైఫ్ సైన్సెస్ రంగం అభివృద్ధికి అనేక అనుకూల అంశాలు ఉన్నాయని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. రాష్ట్రంలో ఉన్న అత్యాధునిక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పరిశోధనా సంస్థలు, ఫార్మా సిటీలు, బయోటెక్ కంపెనీలు ఈ రంగంలో పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా తెలంగాణను మార్చాయని ఆయన అన్నారు. అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సరళీకృత విధానాలు, పారదర్శక వ్యవస్థలు కంపెనీలను ఆకర్షిస్తున్నాయని ఆయన తెలిపారు.

**భవిష్యత్ ప్రణాళికలు**

లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. యువతకు అధునాతన నైపుణ్యాలను అందించేందుకు శిక్షణా కార్యక్రమాలు, పరిశోధనా సంస్థలతో భాగస్వామ్యాలు, ఆవిష్కరణలను ప్రోత్సహించే విధానాలను రూపొందిస్తున్నామని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, ఫార్మా సిటీ వంటి సౌకర్యాలు ఈ రంగంలో ఆవిష్కరణలకు కేంద్రంగా మారాయని, ఇవి గ్లోబల్ కంపెనీలను ఆకర్షిస్తున్నాయని ఆయన వెల్లడించారు.

**ఎదిగేందుకు అవకాశాలు**

తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగంలో గ్లోబల్ హబ్‌గా ఎదిగేందుకు అన్ని అవసరమైన అంశాలను కలిగి ఉందని మంత్రి శ్రీధర్‌బాబు ఉద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం యొక్క స్పష్టమైన దృష్టి, సమర్థవంతమైన విధానాలు, అత్యుత్తమ సౌకర్యాలు ఈ లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సు ద్వారా తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగంలో అవకాశాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శించడం జరిగింది.

# ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

**మొదటిపేజీ తరువాయి**

ఆర్డినెన్స్ జారీ చేయనుంది.
ఈ ఆర్డినెన్స్ ద్వారా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం2018తో పాటు, మున్సిపల్ చట్టాల్లోనూ అవసరమైన సవరణలు చేయనున్నారు. ముఖ్యంగా, పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 21(3)ను పూర్తిగా తొలగించాలని కేబినెట్ స్పష్టం చేసింది. ప్రభుత్వ నిర్ణయం ప్రజాస్వామ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తుందని, మరింత మందికి ప్రజాప్రతినిధులుగా పనిచేసే అవకాశం కల్పిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ఈ సవరణలు పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.



# నేడు పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ

- **విచారణ చేపట్టనున్న అసెంబ్లీ స్పీకర్**
- **నాలుగు కేసులపై మౌఖిక వాదనాలు**
- **ప్రతి కేసులో ఇరువర్గాల వాదనలు**
- **31 వరకు అసెంబ్లీ పరిసరాల్లో ఆంక్షలు**

**హైదరాబాద్, సిద్దిపేట పవర్**

ప్రస్తుత రాజకీయాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హతపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శుక్రవారం(ఈ నెల 24న) విచారణ చేయబోతున్నారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) సదస్సులో పాల్గొనేందుకు ఉత్తర అమెరికా దేశం బార్బడోస్‌కు వెళ్లిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గురువారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేలపై ఈ నెల 30వ తేదీలోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పీకర్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో గత నెలలో ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసిన అసెంబ్లీ స్పీకర్ సెప్టెంబర్ 29 నుంచి అనర్హత పిటిషన్లపై విచారణ ప్రారంభించారు. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, గూడెం మహిపాల్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని బీఆర్ఎస్ న్యాయవాదులు క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. పిటిషనర్లుగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కూడా ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల న్యాయవాదులు క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. అయితే, ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు ఇచ్చిన సమాధానాలపై పిటిషనర్లుగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫిరాయింపులకు సంబంధించి మౌఖిక, లిఖిత పూర్వక వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు. అయితే ఈ నెల 4వ తేదీ వరకు ఇరు పక్షాల ఎమ్మెల్యేల వాదనలు విన్న స్పీకర్ విదేశీ పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మౌఖిక వాదనలు వినిపించేందుకు ఈ నెల 24వ తేదీకి వాయిదా వేశారు. దీంతో విచారణను స్పీకర్ శుక్రవారం ప్రారంభిస్తున్నారు.

**ఇప్పటివరకు స్పందించని దానం, కడియం**

పది మంది ఎమ్మెల్యేలు ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటుండగా వీరిలో కేవలం నలుగురు ఎమ్మెల్యేలకు సంబంధించిన విచారణ షెడ్యూలు మాత్రమే స్పీకర్ గతంలో ప్రకటించారు. మరో నలుగురు ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, డాక్టర్ సంజయ్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెల్లం వెంకట్రావుపై బీఆర్ఎస్ ఇచ్చిన పిటిషన్లపై ఈ నెలాఖరులోగా స్పీకర్ విచారణ షెడ్యూలును ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. కోర్టు విధించిన అక్టోబర్ 30 గడువులోగా ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ పక్రియ ముగిసే అవకాశాలు కనిపించడం లేదు. మరోవైపు స్పీకర్ నోటీసులు అందుకున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్ ఇప్పటి వరకు స్పందించలేదని సమాచారం. ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు స్పీకర్‌కు తమ వివరణ ఇచ్చి ఉంటే సంబంధిత కాపీలు తమకు అంది ఉండేవని బీఆర్ఎస్ శాసనసభాపక్షం వర్గాలు వెల్లడించాయి. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు విధించిన గడువు సమీపిస్తున్న నేపథ్యంలో విచారణ పూర్తి చేసేందుకు మరికొంత గడువు కోరాలనే యోచనలో స్పీకర్ కార్యాలయం ఉన్నటు సమాచారం. ప్రతి కేసులో ఇరు వర్గాలు (పిటిషనర్లు, ప్రతివాదులు) తమ వాదనలు వినిపించనున్నారు. ఈనెల 24న ఉదయం 11 గంటలకు కల్వకుంట్ల సంజయ్ వర్సెస్ టీ. ప్రకాష్ గౌడ్ కేసు విచారణ, మధ్యాహ్నం 12 గంటలకు చింతా ప్రభాకర్ వర్సెస్ కాలే యాదయ్య, మధ్యాహ్నం 2 గంటలకు చింతా ప్రభాకర్ వర్సెస్ గూడెం మహిపాల్ రెడ్డి, మూడు గంటలకు పల్లా రాజేశ్వర్ రెడ్డి వర్సెస్ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కేసు విచారణ కొనసాగనున్నట్లు సమాచారం. ఎమ్మెల్యేల విచారణ నేపథ్యంలో ఈనెల 31 వరకు అసెంబ్లీ పరిసరాల్లో ఆంక్షలు విధించారు.



# రక్షణ రంగానికి ఊతం

- **రూ.79 వేల కోట్ల ప్రతిపాదనలు**
- **రక్షణ కొనుగోళ్ల మండలి భేటీలో ఆమోదం**
- **మరింత మెరుగుపడనున్న యుద్ధ సామర్థ్యం**
- **శత్రు దేశాలకు ఇక చుక్కలే**

**న్యూఢిల్లీ, సిద్దిపేట పవర్**


భారత రక్షణ రంగం మరింత బలోపేతం కానున్నది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రూ.79 వేల కోట్ల విలువైన సైనిక పరికరాల కొనుగోళ్లకు అనుమతినిచ్చింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన రక్షణ కొనుగోళ్ల మండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఫలితంగా భారత సైన్యం, నావికాదళం, వాయు సేనల యుద్ధ సామర్థ్యాన్ని ఇది గణనీయంగా పెంచేందుకు తోడ్పడుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. నాగ్ మిస్సైల్ వ్యవస్థ, గ్రౌండ్ బేస్డ్ మొబైల్ సిస్టమ్స్ అందుబాటులోకి తీసుకొచ్చేలా ముందుకెళ్లనున్నారు. దీనివల్ల శత్రువుల యుద్ధ వాహనాలు, బంకర్లు, దుర్భేద్యమైన నిర్మాణాలను విధ్వంసం చేసే సామర్థ్యం కలుగుతుంది. 24 గంటల ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్, టాక్టికల్ సమాచార సేకరణకూ ఈ నిధులు సహాయపడతాయని రక్షణ శాఖ అధికారులు తెలియజేశారు. డైవర్స్ టెర్రైన్లలో లాజిస్టిక్స్ మద్దతును మెరుగుపరచడానికి హై మొబిలిటీ వెహికల్స్ కూడా కొనుగోళ్ల జాబితాలో చేర్చారు. నావికాదళానికి ల్యాండింగ్ ప్లాట్‌ఫామ్ డాక్స్ 30 మి.మీ. నావల్ సర్ఫేస్ గన్స్ కొనుగోళ్లకు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ రక్షణ రంగ కొనుగోళ్లు భారత రక్షణ వ్యవస్థ మరింత ఆధునికీకరణకు తోడ్పడతాయని అధికారులు తెలిపారు.




# కాంగ్రెస్‌కు 50వేల మెజార్టీ

- **జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నికలో గెలుపు మాదే**
- **నిజామాబాద్‌ను మేటి జిల్లాగా తీర్చిదిద్దుతాం**
- **టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటన**

**హైదరాబాద్, సిద్దిపేట పవర్**



నిజామాబాద్ జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, మేటి జిల్లాగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 50 వేల భారీ మెజారిటీతో గెలుపు ఖాయమని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తమకు విజయాన్ని అందిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రూ.22.69 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం, ఇటీవల హత్యకు గురైన కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని మహేశ్ పరామర్శించారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని, వారికి ఎల్లవేళలా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని, అయితే ఈ రిజర్వేషన్లను ఆపింది బీఆర్ఎస్, బీజేపీ పార్టీలేనని, గవర్నర్ వద్ద బిల్లును పెండింగ్‌లో పెట్టి ఆపారని ఆరోపించారు. అభివృద్ధిలో భాగంగా, రూ.380 కోట్లతో ధర్మపురి నుంచి కొండగట్టు, వేములవాడ, రహత్‌నగర్, భీమ్‌గల్, ఆర్మూర్, నందిపేట్ మీదుగా బాసర వరకు రోడ్డును విస్తరించనున్నట్లు ప్రకటించారు. ఈ రోడ్డు మార్గం ద్వారా నిజామాబాద్ నుంచి కరీంనగర్‌కు దాదాపు 30 కి.మీ. దూరం తగ్గుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇంజనీరింగ్, వ్యవసాయ కళాశాలలను జిల్లాకు తీసుకురావడం 35 ఏళ్ల కల సాకారం అయ్యిందని పేర్కొన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదని, ఒక్క కళాశాల కూడా తీసుకురాలేకపోయారని విమర్శించారు. కేటీఆర్ రాజకీయ ఉనికి కోసం మాత్రమే మాట్లాడుతున్నారని మహేశ్ గౌడ్ హితవు పలికారు.

## వ్యవసాయ మార్కెట్ ను తనిఖీ చేసిన కలెక్టర్

**చేర్యాల, అక్టోబర్ 23 (సిద్దిపేట పవర్)**

చేర్యాల మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాం లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సెంటర్ లో పాడి క్లీనర్, తేమ శాతం కొలత యంత్రాలు, కాంటలు, టార్పలిన్ కవర్లు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచుకోవాలని సెంటర్ సిబ్బందిని ఆదేశించారు. గత పది రోజులుగా సెంటర్ లో ఆరబోయగ తేమశాతం వచ్చిన కూడా కొనుగోలు చేయట్లేదని రైతులు కలెక్టర్ కి విజ్ఞప్తి చెయ్యగా తేమశాతం వచ్చిందని వడ్లు క్లీనింగ్ చేయించి వెంటనే గన్నిలలో నింపి లోడ్ చేయించాలని సెంటర్ సిబ్బంది మరియు తహసిల్దార్ ను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చెయ్యాలని విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందిని ఆదేశించారు. మండలంలో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలు పర్యవేక్షణ చెయ్యాలని తహసిల్దార్ ను ఆదేశించారు. అనంతరం ప్రాంగణం లోని మొక్క జొన్న కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తేమశాతం తనికి చేశారు. మొక్కజొన్నలు ఎండాక క్లీనింగ్ చేసి వెంటనే లోడ్ చెయ్యాలని సెంటర్ సిబ్బందిని ఆదేశించారు.



# వరిధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

**సిద్దిపేట పవర్, దుబ్బాక, అక్టోబర్ 23:**

అకాల వర్షాలతో రోడ్లు దెబ్బతిన్న, ప్రమాదాలలో పలువురు మరణిస్తున్నా ప్రభుత్వానికి సోయలేదని, వారం రోజుల్లో రోడ్ల మరమ్మత్తు కోసం కార్యాచరణ ప్రకటించకపోతే రోడ్డు ప్రమాద బాధితులు, ప్రజలతో కలిసి సచివాలయం ను ముట్టడిస్తామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం దుబ్బాక నియోజకవర్గం లోని రాయపోల్ మండలంలోని బేగంపేట, దౌల్తాబాద్ మండలంలోని దీపాయంపల్లి, శేరిపల్లిబందారం, దొమ్మాట, గాజులపల్లి, మిరుదొడ్డి మండలంలోని చెప్యాల, మిరుదొడ్డి, కాసులాబాద్, అక్బర్ పేటభూంపల్లి మండలంలోని మోతే భూంపల్లి, బేగంపేట గ్రామాల్లో ఐకెపి, సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అకాల వర్షాల మూలంగా రోడ్లు నియోజకవర్గంలో అనేక దెబ్బతిన్నాయని పలుమార్లు పంచాయతీరాజ్, రోడ్డు భవనాల శాఖ మంత్రులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. దెబ్బతిన్న రోడ్ల మూలంగా రోడ్డు ప్రమాదాల్లో పలువురు మరణించారని, ఎంతోమంది గాయపడ్డారని అయినా ప్రభుత్వానికి సోయి లేదన్నారు. బీఆర్ఎస్ హయంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు రోడ్ల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తే వాటిని కూడా రద్దు చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొత్తగా హామ్ పథకం ద్వారా రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నారని వాటిలో ముందు వరుసలో దుబ్బాక నియోజకవర్గం రోడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. హామ్ పథకం లో మంజూరైన రోడ్లకు ఇంతవరకు టెండర్ పనుల ప్రక్రియ ప్రారంభం కాలేదన్నారు. ఇప్పటికైనా హామ్ పథకంలో ఎన్ని రోడ్లు మంజూరు చేస్తున్నారో వారం రోజుల్లో వివరాలన్ని ఇవ్వాలని లేని పక్షంలో దుబ్బాక నియోజకవర్గ ప్రజలతో కలిసి సచివాలయం ముందు ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. రోడ్ల అభివృద్ధి విషయం లో రాజకీయాలకు తావు లేదని ప్రజల పక్షాన అన్ని పార్టీ లు కలిసి ముందుకు రావాలని ఆయన కోరారు. ఇటీవల లింగరాజ్ పల్లి లో బిఆర్ఎస్ నాయకులు ప్రకాష్ తండ్రి మరణించగా ఎమ్మెల్యే వారిని పరామర్శించారు. అలాగే నియోజకవర్గం లోని పలు గ్రామాల్లో పలువురిని ఎమ్మెల్యే పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



**మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించరా..?**

మొక్కజొన్న పంట చేతికి రావడం జరిగిందని ఇప్పటికే సగం ధాన్యం రైతులు రూ.500 నష్టానికి అమ్ముకున్నారని కొనుగోలు కేంద్రాలు ఇంకెప్పుడు ఏర్పాటు చేస్తారని ఎమ్మెల్యే ప్రభుత్వం ను ప్రశ్నించారు. ప్రభుత్వ మద్దతు ధర రూ. 2400 ఉండగా మార్కెట్ లో రూ. 18001900కే రైతులు అమ్ముకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో రైతులకు కష్టాలు తప్పడం లేవని విత్తనాల నుండి మొదలు కొని యూరియా వరకు, చివరికి పంట అమ్ముకునే సమయంలో కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వాసవి క్లబ్ సేవలు అభినందనీయం

- **వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ప్రదీప్**
- **వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సహస్ర దీపాలంకరణ, పులిహోర పంపిణీ, గోపూజ,**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ ప్రతినిధి:**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వాసవి క్లబ్ సేవలు అభినందనీయమని వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇరుకుళ్ళ ప్రదీప్ అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అయ్యప్ప గోశాలలో గోవులకు పూజ చేసి దాన సమర్పించి మొక్కలు నాటారు అనంతరం, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో, సహస్ర దీపాల అలంకరణ చేసి మహిళలకు చీరలు పంపిణీ చేసి సిమెంట్ బెంచీలు వితరణ కార్యక్రమం నిర్వహించి, అనంతరం, గంగిశెట్టి నాగమణి వెంకటేష్ జన్మదినం పురస్కరించుకుని అంగడిపేట్ హనుమాన్ దేవాలయం వద్ద పులిహోర పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ప్రదీప్, ట్రెజరర్ వనజ, డిస్టిక్ వైస్ గవర్నర్ కృష్ణమూర్తి, రీజియన్ చైర్మన్ శశాంక్, జోన్ చైర్మన్ హరి కిరణ్, పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వాసవి క్లబ్ సేవలు అభినందనీయమని, వాసవి క్లబ్ విజిట్ లో భాగంగా, ఇక్కడికి రావడం జరిగిందని, వాసవి క్లబ్ సభ్యులు నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, పలువురికి ఆదర్శంగా నిలుస్తూ, మంచి గుర్తింపు తెచ్చుకున్నారని, క్లబ్ సభ్యులను అభినందిస్తూ సేవ చేయడంలో తృప్తి ఉంటుందని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవలను మరింత విస్తృతపరచాలని కోరారు. అనంతరం నాచారం దేవస్థానం డైరెక్టర్, ఆర్యవైశ్య మహాసభ గజ్వేల్ మండల అధ్యక్షుడు, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వాసవి క్లబ్ అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్, వాసవి క్లబ్ కోశాధికారి గంగిశెట్టి వెంకటేశం మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని వాసవి క్లబ్ సభ్యుల సహకారంతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, వాసవి క్లబ్ అఫిషియల్ విజిట్ లో భాగంగా ఇక్కడికి వచ్చిన వాసవి క్లబ్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడు సిద్ది బిక్షపతి, మర్యాల శ్రీనివాస్, కాశీనాథ్, గంగిశెట్టి వెంకటేశం నాగమణి, జగ్గయ్యగారి లత, కొమరవెల్లి సరిత,సిరిపురం చంద్రకళ,కైలాస ప్రశాంత్, సిద్ది రామచంద్రం ఉమేష్, సిరిపురం సత్యనారాయణ,రమేష్,నితీష్, రాము దీపక్, గందే సంతోష్ తదితరులు పాల్గొన్నారు




## కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- **గజ్వేల్ మార్కెట్ చైర్మన్ నరేందర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ మార్కెట్ చైర్మన్ నరేందర్ రెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పీఏసీఎస్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రమును గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనా రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వద్ద కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం విక్రయించిన ధరకు అమ్ముకోవలని అన్నారు. వడ్లను కల్లాల వద్ద అరబెట్టుకొని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి అమ్ముకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేశిరెడ్డి రవీందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మండల వ్యవసాయ అధికారి వసంత రావు పి ఏ సీ స్ రాములు స్థానిక మాజీ సర్పంచ్ కరుణాకర్,మాజీ ఉప సర్పంచ్ బింగి మల్లేశం వివిధ పార్టీల అధ్యక్షులు నాయకులు బుద్ద నాగరాజు, యూత్ అధ్యక్షులు గణేష్ గౌడ్ గాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,అమర రాము, కొత్త శ్రీనివాస్ రెడ్డి ,అజీస్ కొంపల్లి మహేష్ దండే వెంకటేష్ చిరంజీవి బచ్చలి భాస్కర్, ఆంజనేయులు గౌడ్ ఏ ఈ ఓ ఖలీల్ సిబ్బంది సత్యనారాయణ రెడ్డి, మల్లేశం, బాలరాజు, పోచయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.



# మురికి నీళ్ళల్లో బంగారు భవిష్యత్తు

**చేర్యాల, అక్టోబర్ 23 (సిద్దిపేట పవర్)**

చేర్యాల పట్టణంలో 6 వ వార్డు కి సంబంధించిన బండపల్లి లో ఉన్న ప్రాథమిక పాఠశాల లోకి మురుగు నీరు అంతా వచ్చి చేరుతుంది.. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చేర్యాల పట్టణం నుండి చుంచనకోట గ్రామానికి వెళ్ళే మార్గమధ్యంలో ఉండే మా బండపల్లి నీ పట్టించుకునే నాథుడే లేడు అని, సుమారుగా 25 మంది చిన్న పిల్లలు చదువుకునే పాఠశాలలోకి మురుగు నీరు అంతా వచ్చి చేరుతుంది అని తెలిపారు..గతంలో కూడా చాలా సార్లు మా వార్డు ప్రజలు అందరం కలిసి చేర్యాల మున్సిపల్ కమిషనర్ కి ఈ సమస్య గురించి వినతి పత్రాన్ని అందచేశం అని, కానీ ఇప్పటి వరకు వారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు అని వాపోయారు..ఈ మురుగు నీరు వల్ల విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది అని, ఇప్పటికీ అయిన ఉన్నత అధికారులు స్పందించి ఈ సమస్య కి శాశ్వత పరిష్కారం చూపించి విద్యార్థుల భవిష్యత్తు బంగారు బాటలు వేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు..



## కేతాలమ్మా మేడలమ్మ సామెత మల్లన్నస్వామి దేవాలయంలో ప్రతి అమావాస్య కు పొట్టేతున్న భక్తులు

- **సంతానం లేని వారికీ సంతాన శాపాళ్యం,**
- **ఉద్యోగ సమస్యలలో సతమౌతున్న ఉన్నా**
- **కళ్యాణం కానివారికి కల్యాణ భాగ్యం మహిమ కలుగును**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

ములుగు మండలం కొట్యాల గ్రామంలో వెలసిన కేతాలమ్మ మేడాలమ్మ సమేత మల్లన్న స్వామి దేవాలయంలో ప్రతి అమావాస్యకు పోటెత్తుతున్న భక్తులు ఆ దేవాలయంలో ఆలయంలో దేవుని ముందు నిమ్మకాయలు ఉంచి వాటిని సంతానము లేని వారికి అదేవిధంగా వ్యాపారంలో ఉద్యోగంలో సమస్యలతో సతమతమవుతున్న భక్తులకు అదేవిధంగా కళ్యాణం కానీ వారికి కళ్యాణ సమస్యలతో బాధపడుతున్న వారికి ఇచ్చి వారి వారి కోరికలు నెరవేరేలా కేతాలమ్మ మేడాలమ్మ సమేత మల్లన్న స్వామి కృపాకటాక్షాలతో వారి యొక్క సమస్యలు తొలగిపోయి సంతానము లేని వారికి సంతానము కూడా కలగడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా కళ్యాణం కావటం మల్లన్న దేవాలయానికి ప్రతి అమావాస్యకు అధిక సంఖ్యలో పాల్గొంటున్నరని అన్నారు. ఈ కార్యక్రమం లో భక్తులు ఆలయ ప్రధాన పూజారి డాక్టర్ శివశాస్త్రి ఆలయ నిర్మాణ దాత గంగిశెట్టి గణేష్ గుప్తా గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.ఎవరైనా అమావాస్యకు పాల్గొనాలి అనుకున్న వారు ముందుగా ఆలయ ప్రధాన పూజారిని సంప్రదించగలరు

**డాక్టర్ శివశాస్త్రి 9553559475.**



## భారతీయ జనతా పార్టీ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు

# దొరగోల్ల శ్రీకాంత్ యాదవ్

**దుబ్బాక సిద్దిపేట పవర్ అక్టోబర్ 23 ప్రతినిధి**

మున్సిపల్ ఉపాధ్యక్షుడు భవాని కనకం, ప్రధాన కార్యదర్శులు ఆకుల నరేష్, గట్టు ప్రసాద్, భరత్ చారి తదితరులు గురువారం హైదరాబాద్‌లోని ఎంపీ కార్యాలయంలో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా దుబ్బాక మున్సిపల్ పరిధిలోని వర్డ్‌లలో ఉన్న పలు ప్రజాప్రయోజన సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. రోడ్లు,పారిశుధ్యం,త్రాగునీటి సరఫరా,స్మార్ట్ లైటింగ్ వంటి అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక చర్చ జరిగింది.ఎంపీ రఘునందన్ రావు దుబ్బాక పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష చేయించి, ప్రజా అవసరాల పరిష్కారంలో కేంద్ర పథకాల సహకారంతో చర్యలు తీసుకుంటామని నాయకులకు హామీ ఇచ్చారు. దుబ్బాక ప్రాంత అభివృద్ధి కోసం అవసరమైన నిధుల కేటాయింపునకు తగిన అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పార్టీ స్థాయిలో కృషి చేస్తామని తెలిపారు. భవాని కనకం,



ఆకుల నరేష్, గట్టు ప్రసాద్,భరత్ చారి తదితరులు ఎంపీ స్పందన పట్ల కృతజ్ఞతలు తెలిపారు.



## జూబ్లిహిల్స్ అభివృద్ధి బి ఆర్ ఎస్ తోనే సాధ్యం

- **BRSV రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గదరాజు చందు**

**చేర్యాల, అక్టోబర్ 23 (సిద్దిపేట పవర్)**

చేర్యాల మండలం కడవేర్గు గ్రామానికి చెందిన BRSV రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గదరాజు చందు జూబ్లిహిల్స్ లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు..ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ మా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మేము ఎర్రగడ్డ డివిజన్ లో ప్రచారం చేస్తున్నామని తెలిపారు..అదే విధంగా జూబ్లిహిల్స్ ను గతంలో అభివృద్ధి చేసింది మాగంటి గోపీనాథ్ యే నని, ఇపుడు కూడా మాగంటి సునీత గెలిస్తే కూడా అదే విధంగా అభివృద్ధి చెందుతుంది అని చందు జూబ్లిహిల్స్ ఓటర్లకు వివరించారు.. జూబ్లిహిల్స్ ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు..

## రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ కి పెద్ద చీకోడు విద్యార్థిని ఎంపిక

**దుబ్బాక, సిద్దిపేట పవర్ న్యూస్ అక్టోబర్ 23 ప్రతినిధి**

22/10/2025, ప్రజ్ఞాపూర్ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ ఎంపిక పోటీలు సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ పోటీలలో అండర్-17 బాలికల విభాగంలో దుబ్బాక మండల పరిధిలోని చికోడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్, పెద్ద చీకోడు పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఎం.డి. సమీరా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనది.రాష్ట్ర స్థాయికి ఎంపికైన సమీరాను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. బాలరాజ్, పిడి ఉపాధ్యాయులు పి.భాను కుమార్,ఉపాధ్యాయ బృందం అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యం,మధు,కనకయ్య,విట్టల్, బాలకిషన్,సుచరిత,జ్యోతి, లింగం,రాజశేఖర్, నాగరాజు, ఎల్లం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 26న ఉచిత కృత్రిమ అవయవాల పంపిణీ

**సికింద్రాబాద్, అక్టోబర్ 23 (సిద్దిపేట పవర్ ):**

తెలంగాణ అమెరికన్తెలుగు అసోసియేషన్( టీఏటీఏ), రోటరీ క్లబ్ఆఫ్హైదరాబాద్నార్త్(RCHN) సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కృత్రిమ అవయవాల పంపిణీ శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరం ఈనెల 26 ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హయత్నగర్లోని పోడార్ఇంటర్నేషనల్స్కూల్ప్రాంగణంలో జరగనుంది. కృత్రిమ అవయవాల అవసరం ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు సూచించారు. అవసరమైన పత్రాలతో రాగా వైద్య బృందం పరీక్షించి ఉచితంగా అవయవాలు అందజేయనున్నారు. ఈ కార్యక్రమం నిర్వహణలో రోటరీ క్లబ్అధ్యక్షుడు కేవీ మురళి, ఎం. హరిహర ప్రసాద్, సుమన్ లు, ఖమ్మం రోటరీ ట్రస్ట్ కీలక పాత్ర పోషిస్తున్నారు. పేర్ల నమోదు తో పాటు మరిన్ని వివరాల కోసం మహిత కడియాల 6300760362, సందీప్ రెడ్డి 8897262806 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.





# ధాన్యం కొనుగోళ్లలో... అలసత్వం ప్రదర్శించవద్దు

- **జిల్లా కలెక్టర్ హైమావతి**

**జనమతోడు సిద్దిపేట బ్యూరో:**

ధాన్యం కొనుగోళ్లలో... అలసత్వం ప్రదర్శించవద్దని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు.
చేర్యాల మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాం లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
సెంటర్ లో పాడి క్లీనర్, తేమ శాతం కొలత యంత్రాలు, కాంటలు, టార్పలిన్ కవర్లు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచుకోవాలని సెంటర్ సిబ్బందిని ఆదేశించారు.
గత పది రోజులుగా సెంటర్ లో ఆరబోయగ తేమశాతం వచ్చిన కూడా కొనుగోలు చేయట్లేదని రైతులు కలెక్టర్ కి విజ్ఞప్తి చెయ్యగా తేమశాతం వచ్చిందని వడ్లు క్లీనింగ్ చేయించి వెంటనే గన్నిలలో నింపి లోడ్ చేయించాలని సెంటర్ సిబ్బంది మరియు తహసిల్దార్ ను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చెయ్యాలని విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందిని ఆదేశించారు. మండలంలో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలు పర్యవేక్షణ చెయ్యాలని తహసిల్దార్ ను ఆదేశించారు.అనంతరం ప్రాంగణం లోని మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తేమశాతం తనికి చేశారు. మొక్కజొన్నలు ఎండాక క్లీనింగ్ చేసి



వెంటనే లోడ్ చెయ్యాలని సెంటర్ సిబ్బందిని ఆదేశించారు



## విద్యుత్ పనుల్లో కార్మికులు సేఫ్టీ పాటించాలి

- **కస్టమర్లకు మెరుగైన సేవలందించాలి**
- **విద్యుత్ శాఖ సీఎండీ ముషారప్ అలీ**

**సికింద్రాబాద్, అక్టోబర్ 23 ( సిద్దిపేట పవర్ ) :**

బస్తీబాట లో భాగంగా విద్యుత్ శాఖ సీఎండీ ముషారఫ్ అలీ గురువారం భరతన్ కాంపౌండ్ జనరల్ బజార్ ప్రాంతంలో స్థానిక అధికారులు, సిబ్బందితో కలసి పర్యటించారు. ఈసందర్భంగా ఆ ప్రాంతంలో మిడిల్ పోల్ వేసిన విధానం, కుప్పగా ఉండే వైర్లను ఓ క్రమపద్ధతిలో అమర్చిన పనులను చూసిన ఆయన సిబ్బందిని అభినందించారు. ఈసందర్భంగా సీఎండీ మాట్లాడుతూ..విద్యుత్ పనులు చేసే సమయంలో కార్మికులు కనీసం సేఫ్టీ పాటించాలన్నారు. అలాగే వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి ఎప్పుడు ముందుండాలని సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. వినియోగదారులు ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఆఫీస్, 1912 కస్టమర్ కేర్ నెంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట సికింద్రాబాద్ ఎస్ఈ గోపయ్య, ప్యారడైజ్ డీఈ బ్రహ్మానందం, ఏడీఈ, ఏఈలు, సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా పోలీస్ అమరుల దినోత్సవం

- **మహిళలు, మైనర్ అమ్మాయిల మీద జరిగే నేరాలకు పోలీసు వారు తీసుకునే చర్యల వివరణ**
- **స్థానిక యస్ ఐ జె. కృష్ణారెడ్డి**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

పోలీసు అమరవీరుల దినోత్సవంలో భాగంగా బుధవారం జగదేవపూర్ పోలీస్స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగదేవపూర్ లోని కస్తూరిబా పాఠశాల విద్యార్థులను పోలీస్ స్టేషన్ యొక్క పనితీరును వివరించడం జరిగిందీ. రిసెప్షన్, పెట్రోలింగ్, క్రైమ్ ప్రివెన్షన్, సీసీ కెమెరాల పనితీరు విధానం గురించి వివరించడం జరిగింది. మహిళలు, మైనర్ అమ్మాయిల మీద జరిగే నేరాలకు పోలీసు వారు తీసుకునే చర్యల గురించి చెప్పడం జరిగింది. సైబర్ నేరాలు మా దగ్గర వినియోగము వాటి వల్ల వచ్చే సమస్యల గురించి అవగాహన కల్పించడం జరిగింది. స్టేషన్ కి సంబంధించిన సిబ్బంది వారు చేసే పని గురించి స్టూడెంట్స్ కి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సై, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## 'బస్తీ దావాఖానాలను పట్టించుకోని ప్రభుత్వం'






**సిద్దిపేట పవర్:**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన బస్తీ దవాఖానాలు ప్రస్తుతం సమస్యలతో సతమతం అవుతున్నాయని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల సాయిరాం ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బస్తీ దవాఖానాలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. నిరుపేదలకు వైద్య సేవలను అందించే సదుద్దేశంతో తమ ప్రభుత్వం ఈ బస్తీ దవాఖానాలపై కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు ఈ రోజు సిద్దిపేటలోని పలు బస్తీ దవాఖానాలను సందర్శించారు. అక్కడి వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కాంటాలను ప్రారంభించాలి

- **తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో..**

**చేర్యాల, అక్టోబర్ 23 (సిద్దిపేట పవర్):**



ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 15 రోజులు గడుస్తున్నప్పటికీ నేటికీ కొనుగోలు కాంటాలు ప్రారంభం కాలేదని రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తెచ్చి 15 రోజులైనప్పటికీ ఎప్పుడు కొనుగోలు కాంటాలు ప్రారంభిస్తారని రైతులు ఎదురు చూస్తున్న పరిస్థితి మండల లో ఉంది. మండలంలోని ఆకునూరు గ్రామ ఐకెపి నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం కుప్పలతో నిండిపోయిందని కొనుగోళ్ళు ప్రారంభం కాకపోవడం వల్ల రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వెంటనే కొనుగోళ్ళు ను మొదలుపెట్టి ధాన్యాన్ని తూకాలు వేసి రైతుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుండి వెంట వెంటనే ధాన్యాన్ని గోదాములకు చేర్చాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రోజున మండలం లోని ఆకునూరు గ్రామ ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా కొంగరి వెంకట మావో మాట్లాడుతూ రైతులు తమ వరి పంటను కోత కోసి అమ్మకానికి సిద్ధం చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పడిగాపులు కాస్తున్నారని 15 రోజులైనా వరి ధాన్యాన్ని కాంటాలు వేసి గోదాములకు తరలించే ప్రయత్నం ప్రభుత్వము, ఐకెపి అధికారులు చేయడం లేదని వెంటనే కొనుగోలు కాంటాలు ప్రారంభించి రైతుల ధాన్యాన్ని గోదాములకు చేర్చాలని ప్రతిరోజు అనుకోకుండా అకాల వర్షాలు కురుస్తూ ఆరబెట్టిన ధాన్యం పాడైపోయే పరిస్థితులు కనబడుతున్నాయని కొనుగోలు కాంటాలు ఆలస్యమైనా కొద్దీ రైతులకు నష్టం జరుగుతున్న పరిస్థితి ఉందని రాష్ట్ర ప్రభుత్వం వర్షాకాలం పండిన వరి ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేస్తామని ప్రకటించినప్పటికీ నేటికీ ఒక్క రైతు ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేదని కాంటాలు ప్రారంభించనేలేదని వెంటనే కాంటాలు ప్రారంభించి ధాన్యాన్ని గోదాములకు చేర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులను ఏకం చేసి పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దొండకాయల సంపత్ ,రమేష్, గోపాల్ రెడ్డి, కదారి రాజయ్య, అనుముల శ్రీనివాస్ రెడ్డి, కదారి సాయిబాబా, బాలవ్వ తదితరులు పాల్గొన్నారు.


WWW.SIDDIPETPOWER.COM

# జూబ్లీహిల్స్ బరిలో 81 మంది ?

- 211 అభ్యర్థులు 321 నామినేషన్‌లు
- 130 అభ్యర్థులకు చెందిన 186 తిరస్కరణ
- పోటీలో ఎంతమంది అనేదానిపై ఎట్టకేలకు క్లారిటీ
- నేటితో ముగియనున్న ఉపసంహరణ గడువు




**హైదరాబాద్, సిద్దిపేట పవర్**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నామినేషన్‌లు, అభ్యర్థుల సంఖ్యలో ఎట్టకేలకు గురువారం క్లారిటీ వచ్చింది. కనీసం 150కి పోటీలో ఉండే అవకాశం ఉంటుందని ఎన్నికల అధికారులు భావించగా, ఆ సంఖ్య 81కి తగ్గింది. గత మంగళవారంతో ముగిసిన నామినేషన్‌ల స్వీకరణలో 211 మంది 321 నామినేషన్‌లు దాఖలు చేయగా నామినేషన్ల పరిశీలన చేపట్టిన అధికారులు కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయంటూ 130 అభ్యర్థులకు చెందిన 186 నామినేషన్లు తిరస్కరించారు. ఇక 81 మందికి చెందిన 153 నామినేషన్‌లు ఆమోదం పొందాయి. వీరిలో ఏ ఒక్కరూ కూడా నేటి విత్ డ్రా గడువులోగా ఉపసంహరించుకోకపోతే 81 మంది పోటీలో ఉండే అవకాశం ఉంది. ఇందుకు 5 ఈవీఎంలు అవసరమవుతాయి. కానీ, ఈ రోజు విత్ డ్రా సమయానికి భారీగానే సంవారించుకుంటారన్న వాదనలు లేకపోలేదు.

**పోటీలో 3 గుర్తింపు, 27 రిజిష్టర్ పార్టీల అభ్యర్థులు**

బరిలో నిలిచిన వారిలో 30 మంది గుర్తింపు పొందిన, రిజిష్టర్ పార్టీల తరపున పోటీచేస్తోన్న వారి సంఖ్య కూడా భారీగానే ఉంది. ప్రధానంగా గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలలో కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి మాగంటి సునీత, బీజేపీ నుంచి లంకల దీపక్‌రెడ్డిలు పోటీలో నిలవగా, మరో 27 గుర్తింపు పొందని రిజిష్టర్ పార్టీల నుంచి పోటీలో నిలిచారు. వీరితో పాటు 51 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా బరిలో ఉన్నారు. గురువారం సాయంత్రం విత్ డ్రాయల్ గడువులోగా కనీసం 30 మంది పైగానే తమ నామినేషన్‌లను ఉపసంహరించుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

# గోరక్షకుడు ప్రశాంత్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించిన ఎంపీ ఈటల రాజేందర్

**హైదరాబాద్,అక్టోబర్ 23 (సిద్దిపేట పవర్):**

గోరక్షకుడు ప్రశాంత్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో డీజీపీ కార్యాలయం ముట్టడించిన సందర్భంగా మీడియాతో ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారు. “కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో లాఅండ్ ఆర్డర్ పూర్తిగా అదుపు తప్పిపోయింది. గన్ కల్చర్ పెరిగిపోయింది. నేను మేడ్చల్, శామీర్‌పేట్, కీసర, ఘట్కేసర్ ప్రాంతాల్లో ప్రతిరోజూ వందలాది ట్రక్కులు గోవులను తరలించడాన్ని చూస్తున్నాను. ఇది ఒక మాఫియాగా మారింది. వీటిని అడ్డుకోవడం ప్రభుత్వ బాధ్యత. గోరక్షకులు సమాచారం ఇస్తున్నప్పటికీ పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారు. అందుకే వారు స్వయంగా అడ్డుకోవడానికి ముందుకొస్తున్నారు. కానీ వారిపైనే దాడులు, ట్రక్కులతో గుద్దడం, కత్తులతో గాయపరచడం, ఇప్పుడు తుపాకీ కాల్పులు జరపడం వంటివి తీవ్రంగా ఆందోళన కలిగిస్తున్నాయి,” అని ఈటల అన్నారు. ప్రశాంత్‌పై నిన్న తుపాకీతో కాల్పులు జరపడం ఎంత ధైర్యం కావాలో ప్రభుత్వం ఆలోచించాలి అని ఆయన ప్రశ్నించారు. “వీరికి ఎవరు అండగా ఉన్నారు? ఎవరి ప్రోత్సాహం ఉంది? చట్టం ఉన్నట్టా లేనట్టా? దీని పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపించి, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి,” అని ఆయన డిమాండ్ చేశారు. అలాగే హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ప్రస్తావిస్తూ -



“రాంపల్లిలో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ ఆలయంపై దాడి చేశారు. ఇప్పటివరకు 4045 దేవాలయాలపై దాడులు జరిగాయి. దాడులు చేసినవారిని ‘సైకో’లు అని చెప్పి తప్పించుకోవడం సరికాదు. సమాజాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది మంచిది కాదు,”అని హెచ్చరించారు

# మహాకూటమి పోస్టర్ల నుంచి రాహుల్ గాంధీ మాయం!

**మొదటిపేజీ తరువాయి**



ప్రముఖంగా ప్రదర్శించారు. మిగతా భాగస్వామ్య పక్షాల నేతల చిన్న ఫొటోలు ఉన్నా, రాహుల్ గాంధీ ఫొటో మాత్రం ఎక్కడా కనిపించలేదు.ఈ పరిణామంపై బీజేపీ వెంటనే విమర్శలు ఎక్కుపెట్టింది. "నిన్నటి వరకు రాహుల్ గాంధీయే కూటమి ముఖచిత్రం అన్నారు. కానీ ఇప్పుడు చూస్తుంటే కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం గౌరవం లేదని స్పష్టమవుతోంది. ఈ కూటమికి ఒక లక్ష్యం గానీ, ఒక దార్శనికత గానీ లేవు. గందరగోళం, విభజన, పదవుల కోసం ఆశ తప్ప ఏమీ లేదు. ఇంకా అభ్యర్థులనే ఖరారు చేయలేని పరిస్థితిలో ఉన్నారు" అని బీజేపీ నేత షెహజాద్ పూనావాలా ఎద్దేవా చేశారు. మరో బీజేపీ నేత ప్రదీప్ భండారి స్పందిస్తూ "తేజస్వి యాదవ్, ఆయన మద్దతుదారులు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని అవమానించారు. మహాకూటమిలో ఆర్జేడీ, కాంగ్రెస్ మధ్య మహాభారతం కొనసాగుతోంది" అని ఆరోపించారు.

**తేజస్వి వైపే మొగ్గు.. వ్యూహం ఇదే!**

మరోవైపు, బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాకూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వి యాదవ్‌ను ప్రకటించేందుకు కూటమిలోని అన్ని పార్టీలు అంగీకరించినట్లు ఆర్జేడీ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది. "చలో బీహార్, బద్లేం బీహార్" (పదండి బీహార్, మారుద్దాం బీహార్) అనే నినాదంతో ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు సమాచారం.
కేంద్రం, బీహార్ ప్రభుత్వాలు మహిళలకు రూ. 10,000 నగదు బదిలీ పథకాలను ప్రకటించడంతో, వాటి ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ ‘కులం కార్డు’ను ప్రయోగించక తప్పలేదని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఎన్నికలకు ముందు తేజస్విని సీఎం అభ్యర్థిగా బలంగా ప్రొజెక్ట్ చేయడం ద్వారా యాదవ (14 శాతం), ముస్లిం (18 శాతం) ఓట్లను పూర్తిగా ఏకం చేయవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ 32 శాతం ఓటు బ్యాంకుతో ఎన్నికల బరిలో కూటమికి గట్టి పునాది పడుతుందని అంచనా వేస్తున్నారు.

**కొలిక్కిరాని సీట్ల పంపకాలు**

నామినేషన్ల ఉపసంహరణకు నేడే చివరి రోజు అయినప్పటికీ, మహాకూటమిలో దాదాపు డజను సీట్లపై ఇంకా వివాదం కొనసాగుతోంది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు కాంగ్రెస్ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ బుధవారం పాట్నా చేరుకున్నారు. ఆయన ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వి యాదవ్‌తో సమావేశమయ్యారు. అనంతరం, 243 సీట్లున్న అసెంబ్లీలో 510 స్థానాల్లో ‘స్నేహపూర్వక పోటీ’ ఉండటం పెద్ద సమస్య కాదని గెహ్లాట్ వ్యాఖ్యానించారు.

# సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ను అడ్డుకుంటాం

- వామ పక్ష పార్టీల హెచ్చరిక .

**పెద గంట్యాడ,అక్టోబర్ 23(సిద్దిపేట పవర్):**

పెద గంట్యాడ శివారులో ఏర్పాటు కానున్న అదానీ అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ను ఉద్యమాల ద్వారా అడ్డుకుంటామని వామ పక్ష పార్టీలు స్పష్టం చేసాయి. అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు ను వ్యతిరేకిస్తూ గురువారం పెద గంట్యాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద వామ పక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు .ధర్నా నుద్దేశించి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కసి రెడ్డి సత్యనారాయణ , సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు , సిపిఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు , సిపిఐ ఎం.ఎల్ ప్రజా పోరు నాయకులు దేవా మాట్లాడుతూ పెద గంట్యాడ శివారులో అదానీ అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు జరిగితే గాజువాక నియోజక వర్గం అంతా బూడిద మయం అవుతుందని , ఇప్పటికే గంగవరం పోర్టు వల్ల ఈ ప్రాంత మంతా తీవ్ర కాలుష్యం తో నిండి పోయి ప్రజలంతా అనారోగ్యానికి గురి అయ్యారని అన్నారు . ఐక్య ఉద్యమాల ద్వారా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ను ఎదుర్కొంటామని అన్నారు. సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు ప్రక్రియ ను తక్షణమే నిలిపి వేయాలని, లేని పక్షం లో ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు . అనంతరం వామ పక్ష పార్టీల ప్రతినిధి బృందం పెద గంట్యాడ తహసీల్దార్ అమలకు వినతి పత్రం అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సత్యాంజనేయ,జిల్లా సమితి సభ్యులు జి.ఆనంద్,జి. రాంబాబు,కె.అచ్యుత రావు , పల్లేటి పోలయ్య,పెద పూడి దుర్గా రావు, సిపిఎం నాయకులు ఎం.రాంబాబు,సంతోషం , డి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు




# వరి కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి

**అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

**వనపర్తి,అక్టోబర్ 23 (సిద్దిపేట పవర్):**

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఖీమ్యా నాయక్ అధికారులు,కేంద్రాల నిర్వాహకులకు ఆదేశించారు. గురువారం ఖిల్లా ఘన పురం మండల రైతు వేదికలో వరి కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు వరి కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని, ఖరీఫ్ 202526 సీజన్‌లో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా సాగించాలన్నారు.సన్న,దొడ్డు రకాలను సరిగ్గా గుర్తించే విధంగా నిర్వాహకులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వర్షాల సమయంలో ఇబ్బందులు రాకుండా టార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచాలని, కొనుగోలు చేసిన వెంటనే ధాన్యాన్ని నిర్ణీత మిల్లులకు తరలించాలని, గన్నీ బ్యాగులు సమృద్ధిగా సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సివిల్ సప్లై డీఎం జగన్,వ్యవసాయ అధికారులు,ఇతర విభాగాధికారులు పాల్గొన్నారు.



# అనారోగ్య బాధితుడికి అండగా ఎమ్మెల్యే మేఘారెడ్డి.

- రూ.2.50 లక్షల ఎల్ ఓ సి మంజూరు – ఆపత్కాలంలో అండగా నిలిచిన ప్రజానేత

**వనపర్తి,అక్టోబర్ 23 (సిద్దిపేట పవర్):**



ప్రజల కష్టాలు తనవిగా భావిస్తూ, ప్రజా సేవకు నిబద్ధతతో ముందుకు సాగుతున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మరోసారి తన సేవా హృదయాన్ని చాటుకున్నారు. వనపర్తి మండలం సవాయిగూడెం గ్రామానికి చెందిన జెనిల సాయిబాబా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం పెద్ద మొత్తం వ్యయం అవసరమవుతున్నా, ఆర్థిక ఇబ్బందులు తీవ్రంగా తలెత్తడంతో ఆయన కుటుంబం ఆందోళనకు గురైంది. పార్టీ నాయకుల ద్వారా వారి ఇబ్బంది తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి తక్షణమే స్పందించి, సాయిబాబా వైద్య చికిత్స నిమిత్తం రూ. 2 లక్షల 50 వేల రూపాయల ఎల్‌ఓసి( లెటర్ అఫ్ క్రెడిట్ )ని మంజూరు చేయించారు. మేఘారెడ్డి నిజమైన ప్రజానాయకుడు గురువారం హైదరాబాద్ మాదాపూర్‌లోని తన కార్యాలయంలో, మేఘారెడ్డి పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ “ శాసనసభ్యులు మేఘారెడ్డి మా సమస్యను తమదిగా భావించి సాయం అందించారు. ఆయన వల్లే మాకు ఇప్పుడు ఆశ కలిగింది.” అని భావోద్వేగంతో చెప్పారు.
ప్రజల మన్ననలు పొందుతున్న సేవా మనసు వనపర్తి ప్రజల పట్ల ఎల్లప్పుడూ అంకితభావంతో ఉన్న మేఘారెడ్డి ఆపత్కాలంలో అండగా నిలిచే ప్రజానాయకుడిగా పేరుపొందారు.

# ప్రజలు కోరుకుంటే రాజకీయ పార్టీగా మారొచ్చు

**మొదటిపేజీ తరువాయి**

కల్వ కుంట్ల కవిత అన్నారు. తెలంగాణ జాగృతి కార్యకర్తలతో కలిసి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైకుంఠ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ జాగృతి సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్ గా ఉన్నా ప్రజల సమస్యలపై గళ మెత్తిందన్నారు. ఇకపైనా అదే వైఖరిని కంటిన్యూ చేస్తామని అన్నారు.
తెలంగాణ ఉద్యమంలో ప్రజల తరపున మాట్లాడామని, ఏం చేస్తే ప్రజలకు మంచి జరుగుతుందో తెలంగాణ జాగృతి తన గళాన్ని వినిపించిందని అన్నారు. ప్రజల తరపున పోరాడాలంటే రాజకీయ పార్టే కానవసరం లేదన్న ఆమె.. కానీ ప్రజలు కోరుకుంటే మాత్రం తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా మారవచ్చని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలో అనేక ప్రాంతీయ పార్టీలు ఉన్నాయన్నారు. తెలంగాణ జాగృతి కూడా రాజకీయపార్టీగా మారడం కూడా పెద్ద విషయం కాద న్నారు. కానీ సమయం, సందర్భంగా వచ్చిన పుడు జాగృతి సంస్థ కూడా రాజకీయ పార్టీగా ఆవిర్భవించవచ్చని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల వల్ల ప్రజలకు మంచి జరగాలనేది తమ సంకల్పమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడం కోసమే ఈ నెల 25న నిజామాబాద్ లో తెలంగాణ జాగృతి జనం బాట యాత్రను ప్రారంభించి నాలుగు నెలల పాటు నిర్విరామంగా కొనసాగించనున్నట్లు వెల్లడిరచారు. అందరి సలహాలు, సూచనలతో యాత్రను నిర్వహిస్తున్నట్టు చెప్పారు



# రాజయ్యపేట మత్స్యకారులకు అండగా నిలుద్దాం.

- లక్ష రూపాయలు విరాళం ప్రకటించిన వాసుపల్లి
- సమన్వయ కమిటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గణేష్ కుమార్

**విశాఖపట్నం,అక్టోబర్ 23(సిద్దిపేట పవర్):**

బల్క్ డ్రగ్స్ పార్కును వ్యతిరేకిస్తూ నక్కపల్లి రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. స్థానికులకు ఒప్పించి వారి ఆమోదంతోనే కంపెనీలు ఏర్పాటు చేయాలని జగనన్న మాటగా డిమాండ్ చేస్తున్నట్లు వాసుపల్లి గణేష్ కుమార్ వెల్లడించారు. ఆసీలమెట్టలో గల పార్టీ కార్యాలయంలో దక్షిణ వైసీపీ శ్రేణులు, మత్స్యకార నాయకులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి మత్స్యకారుడిగా తన వాళ్ళు ఎక్కడ ఉన్నా.. అండగా ఉంటాం అని భరోసా ఇచ్చారు. బల్క్ డ్రగ్ పార్కు వ్యతిరేకిస్తూ రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు వైఎస్సార్ సీపీ పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తుందన్నారు. స్థానికులను ఒప్పించి వారి ఆమోదంతోనే కంపెనీలు ఏర్పాటు చేయాలనీ గుర్తు చేశారు. ఇది జగనన్న మాటగా చెబుతున్నాం అన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి లో వందలాదిమంది పోలీసులను దించడం కూటమి సర్కార్ సిగ్గుమాలిన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దారులన్నీ దిగ్బంధం చేయడం పిరికి బంద చర్యగా ఆయన అభివర్ణించారు. సంఘీభావం తెలిపే నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. రాజయ్యపేట మత్స్యకారులను ఒంటరి వాళ్లను చేసేందుకు యత్నించడం దారుణమన్నారు. వారం రోజులగా అమలవుతున్న కూటమి నేతల కుటిల నీతిని తుత్తునియలు చేస్తూ వైఎస్సార్సీపీ1 అండగా నిలిచి, మేమున్నామని భరోసా ఇచ్చిందన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహ న్రెడ్డి ఆదేశంతో 'చలో రాజయ్యపేట'కు పిలుపునిచ్చి పార్టీ అగ్ర నేతలు గ్రామాన్ని ఇటీవల సందర్శించారనీ పేర్కొన్నారు. డ్రగ్ పరిశ్రమ ఆపే వరకు మత్స్యకారులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార అనుబంధ సంఘాల నాయకులు, దక్షిణ వైయస్సార్సీపీ శ్రేణులు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు, సినియర్ నాయుకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కాల మాన పరిస్తులకు దర్పణం నాటకం

- పోలీస్ కమిషనర్ డా శంఖ బ్రత బాగ్చి

**విశాఖపట్నం,అక్టోబర్ 23(సిద్దిపేట పవర్):**



నాటకాలు కాల మాన పరిస్తులకు దర్పణం పడతాయని ఆదరించి ప్రోత్సహించాలని పోలీస్ కమిషనర్ డా శంఖ బ్రత బాగ్చి పేర్కొన్నారు. బుధవారం తన ఛాంబర్ లో డా. శంఖ బ్రత బాగ్చి రసజ్ఞ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డా వేమలి త్రినాథ్ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ నుండి 4 రోజుల పాటు జరిగే బహు భాషా నాటకోత్సవాలు పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డా శంఖ బ్రత బాగ్చి మాట్లాడుతూ నాటకాలు సమాజ పరిస్తులకు దర్పణంగా నిలుస్తాయన్నారు. వీటిని ఆదరించి ప్రోత్సహిస్తే తరాలు మారినా సమాజ ఘటనలు ప్రతిఫలింప జేస్తాయన్నారు. నిర్వాహక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డా వేమలి త్రినాథ్ రావు మాట్లాడుతూ కళాభారతి లో జరిగే నాటకోసవాలు ప్రవేశం ఉచితం అన్నారు.ఈ బహు భాషా నాటకోత్సవాలు ను ఆదరించి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో హేమ వెంకటేశ్వరి కూడా పాల్గొన్నారు.